

అసంతృప్తుల దారెటో..?

ఫ్యాన్ పార్టీలో కలవరం

పుట్టపర్తి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం ఇన్నాళ్లూ కష్టపడ్డారు. జగనన్న చిత్రాన్ని నెత్తిన పెట్టుకుని ఇంటింటా తిరిగి పార్టీ ప్రచారానికి లక్షలు ధారబోశారు. అలాంటి వారిని మాట వరుసకైనా సంప్రదించకుండా వైసీపీ అధిష్ఠానం అభ్యర్థులను ప్రకటించడంపై వారు గుర్రుగా ఉన్నారు. పార్టీ బలవంతంగా రుద్దితే.. వారి గెలుపు కోసం తాము పనిచేయాలా అంటూ వైసీపీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ జిల్లాలో ఎంపీ, ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను పక్కన పెట్టి కొత్త ముఖాలతోపాటు వలస వచ్చిన మంత్రికి సీటిచ్చారు. ఒకే సామాజికవర్గానికి చెందిన ముగ్గురు సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం ఇవ్వడం ఆయా నియోజకవర్గాల్లో పక్కన పెట్టిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, టిక్కెట్లు ఆశించి భంగపడిన నేతల అనుచరగణాన్ని నిరాశలోకి నెట్టేసింది. ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తే ఎన్నికల్లో హ్యాండిచ్చి రాజకీయ భవిష్యత్తే లేకుండా చేశారని ఆయా నాయకులు, వారి అనుచరులు అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్లు శ్రమిస్తే ఇప్పుడు పోటీకి వేరొకరు కావాల్సి వచ్చిందా అంటూ గుర్రుగా ఉన్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గాల్లో వీరు వైసీపీ అభ్యర్థులకు పక్కలో బల్లెంలా తయారయ్యారు. ఎన్నికల వేళ ఈ పరిస్థితి ఫ్యాన్ పార్టీని కలవరపెడుతోంది. ఎన్నికల్లో వీరు ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది.


పుట్టపర్తిలో మింగుడుపడక..

పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే కచ్చితంగా ఓడిస్తామని వైసీపీ అసమ్మతి నేతలు పలుమార్లు అధిష్ఠానాన్ని హెచ్చరించారు. పుట్టపర్తి టిక్కెట్ ఆశించిన వైసీపీ మాజీ సమన్వయకర్త సోమశేఖర్‌రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, వైద్యుడు దేశాయి నాగేంద్రకుమార్‌రెడ్డి సమావేశమై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఎమ్మెల్యేపై ద్వితీయ శ్రేణి నేతలతోపాటు పార్టీ కార్యకర్తలతో అసమ్మతి నేతలు పలు సమావేశాలు నిర్వహించారు. తారస్థాయికి చేరిన అసమ్మతిని చల్లార్చేందుకు టిక్కెట్ ఆశిస్తున్న కొందరు నేతలతో సీఎం వద్ద పంచాయితీ పెట్టారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రంగంలోకి దింపినా అసమ్మతి వర్గం ఏమాత్రం తగ్గలేదు. చివరకు సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డికే అధిష్ఠానం మళ్లీ అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో అసమ్మతి వర్గ నేతలు సోమవారం సమావేశమై, అభ్యర్థి శ్రీధర్ రెడ్డిని మార్చాలని అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. వైసీపీ వారి డిమాండ్‌ను పెడచెవిన పెడుతుండడంతో అసంతృప్తుల దారెటో అన్న చర్చ సాగుతోంది.

సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితేంటో?

కదిరి, మడకశిర సిట్టింగ్ ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామిని పక్కనపెట్టి కొత్త ముఖాలకు వైసీపీ అవకాశం ఇచ్చింది. ఎస్సీ నియోజకవర్గం మడకశిరకు ఈరలక్కప్పను అభ్యర్థిగా ప్రకటించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు ఆయన వర్గీయుల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వైసీపీ కదిరి సమన్వయకర్తగా మక్బూల్ అహ్మద్ నియామకంపై సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డి అనుచరులతోపాటు కొందరు ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వెల్లగక్కారు. పార్టీ అధిష్ఠానం తీసుకున్న ఏకపక్ష నిర్ణయం పట్ల ఆగ్రహంతో ఉన్నారు. కొత్త సమన్వయకర్తకు ఎమ్మెల్యే సిద్దారెడ్డితోపాటు ఆయన వర్గీయులు సహకరించడంలేదు. నష్టనివారణ కోసం అధిష్ఠానం రంగంలోకి దిగి బుజ్జగింపులకు దిగినా ప్రయోజనం లేదు. అసమ్మతి నేతలు వెనక్కి తగ్గకపోగా.. ఎవరికివారుగానే వ్యవహరించారు. తాజాగా ఎమ్మెల్యే అభ్యర్థిగా మగ్బూల్‌ను ఖరారు చేయడంతో సిద్దారెడ్డి వర్గీయులు డోలాయమానంలో పడ్డారు. ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేల దారెటో అన్న చర్చనడుస్తోంది. పెనుకొండలో సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపినా.. ఆయన అనుచరవర్గం మాత్రం పెనుకొండ అభ్యర్థి ఉషశ్రీచరణ్ వెంట నడవట్లేదు. కొందరైతే ఏకంగా రహస్య సమావేశాలు పెట్టి, ఉషశ్రీచరణ్‌కు పొగ పెడుతున్నారు. కదిరి, మడకశిర, పుట్టపర్తి, పెనుకొండలో అసమ్మతి నేతలకు భంగపాటుతో భవిష్యత్తుపై మల్లగుల్లాలు పడుతున్నారు.

జనం సొమ్ము తీసుకుని.. జగన్ భజన..!





వైసీపీ సేవలో వలంటీర్లు

- ఎన్నికల ముంగిట మరో మోసానికి ప్లాన్
- వైసీపీకి అండగా నిలవాలంటూ రహస్య ప్రచారం
- ఇళ్లకు వెళ్లి కోరుతున్న వైనం
- తిరస్కరిస్తున్న ప్రజానీకం
- చేసింది చాలు.. వెళ్లిపోవాలంటూ ఛీకొడుతున్న ప్రజలు



హిందూపురం

వలంటీర్లు అంటే లాభాపేక్ష లేకుండా ప్రజాసేవ చేసేవారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడమే వారి విధి. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత వలంటీరు అన్న పదానికి అర్థం మార్చేశారు. జగన్ తన రాజకీయ భవిష్యత్తు కోసం వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారన్నది నిర్వివాదాంశం. ప్రజల సొమ్ముతో జీతాలిస్తూ సొంత పార్టీకోసం ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు వలంటీర్లను ఉపయోగించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. కొందరు వలంటీర్లు తెగించి.. వైసీపీ నాయకులు చెప్పిన ప్రతి దానికీ తలూపి, విమర్శల పాలవుతున్నారు.

బరితెగిస్తున్న కొందరు వలంటీర్లు..

వైసీపీ అధికారంలోకి వచ్చాక వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారు. నెలకు రూ.5 వేలు గౌరవవేతనం అని చెప్పి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించారు. వలంటీరుగా ఎంపిక కావాలంటే మొదటి అర్హత వైసీపీ సభ్యుడిగా ఉండాలన్నది బహిరంగ రహస్యమే. వీరికి నెలకు రూ.5వేలు వైసీపీ ఫండ్ నుంచి ఇవ్వడం లేదు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఇతరత్రా సమాచారం అంతా వలంటీర్ల ద్వారానే సేకరిస్తున్నారు. ప్రతి ఇంటి గుట్టూ వలంటీరు చేతుల్లో ఉంది. అంటే ఆ కుటుంబ విషయాలన్నీ వారివద్ద ఉంచుతున్నారు. పూర్తి సమాచారం వారి చేతుల్లోకి వెళ్లింది. దీనిని ఆసరాగా తీసుకుని, కొంతమంది వలంటీర్లు బరితెగిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రజల సొమ్ముతో నెలనెలా గౌరవ వేతనం తీసుకుంటూ వైసీపీ గడప గడపకు కార్యక్రమంలో పాల్గొనడాన్ని పలువురు తప్పుబట్టారు. ఇది చాలదన్నట్లు వైసీపీ పాలనలో మీ కుటుంబానికి చేకూరుతున్న లబ్ధి ఇది' అంటూ ప్రతి ఇంటికీ వలంటీరు వెళ్లి మరోసారి జగన్ భజన ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వెలువడిన తరువాత ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా కొంతమంది వలంటీర్లు ఒక్కొక్కరే ఇళ్ల వద్దకెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందనీ, అండగా నిలవాలని కోరుతున్నారు.

ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయంటూ..

వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు ఇంటివద్దకే వచ్చాయనీ, అలాంటపుడు ఇలాంటి సీఎంను వదులుకోకూడదని చెబుతున్నారు. టీడీపీ హయాంలో ఇచ్చిన పింఛన్లు, స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు, విదేశీవిద్య, రుణమాఫీ, రైతు భరోసా, ఇతరత్రా వాటిని పేరుమార్చి వాటన్నింటికీ జగనే అంబాసిడర్‌గా చెప్పుకుంటూ వస్తున్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయి. దీంతో అందరూ వైసీపీకి అండగా ఉండాలంటూ కోరుతున్నారు.

నవరత్నాలతో నయా మోసం

ఎన్ని అబద్ధాలు చెప్పినా నమ్ముతారని వైసీపీ పాలక పెద్దలు భావిస్తున్నట్లున్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రసంగాల్లో వల్లెవేస్తున్న అబద్ధాలనే వలంటీర్లు.. ప్రజలకు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పట్టణంలోని చిన్నమార్కెట్ ప్రాంతంలో ఆదివారం ఓ మహిళా వలంటీరు.. జగన్ పథకాలపై వివరించేందుకు ఇళ్ల వద్దకు వెళ్లింది. ఆ ప్రాంత మహిళలు 'ఇప్పటి వరకు చేసింది చాలు.. ఇక మీరు వెళ్లండ'ని మొహం మీదే చెప్పారట. ఇదే ప్రాంతంలో ఇంటి వద్దకు వలంటీరు వెళ్లి 'మీకు ప్రభుత్వం నుంచి ఇంత లబ్ధి చేకూరింద'ని వివరించబోయాడు. 'మాకు ఎలాంటి లబ్ధి అవసరం లేదనీ, మాపై వేస్తున్న పన్నులు తగ్గిస్తే చాలు వెళ్లండ'ని ఆ ఇంటివారు ఆగ్రహించారు. దీంతో వలంటీరు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అధికార పార్టీ ఒత్తిళ్లు

'దేశంలో ఇలాంటి సీఎం లేడ'ని వలంటీర్లు జగన్ భజన చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ సొమ్మంటే వైసీపీకి జేబులో డబ్బుగా భావిస్తున్నారు. అడ్డగోలుగా జనం సొమ్ము ఖర్చు చేయడమేకాక ప్రజలు కట్టిన పన్నులతో జీతం తీసుకుంటున్న వలంటీర్లు.. జగన్ భజన చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసి, ఇళ్లవద్దకు వెళ్లాలని ఆదేశిస్తున్నట్లు సమాచారం. ఇటీవల వైసీపీ సమన్వయకర్తలు.. వలంటీర్లతో రహస్యంగా సమావేశమై, నోటిఫికేషన్ వచ్చాక పోలింగ్ వరకు ఎలాంటి ప్రచారం చేయాలో దిశానిర్దేశం చేసినట్లు చర్చ సాగుతోంది. 'వైసీపీకి ఏ వలంటీరు పరిధిలో ఎన్ని ఓట్లు పడతాయో మాకు తెలుస్తుందనీ, ఒకవేళ మీ పరిధిలో పార్టీకి తక్కువ ఓట్లు వస్తే.. మీపై చర్యలు ఉంటాయ'ని హెచ్చరించినట్లు సమాచారం. ఏది ఏమైనా ప్రజల సొమ్ముతో వలంటీర్లు జీతాలు తీసుకుంటూ వైసీపీకి భజన చేయడం ఎంత వరకు సమంజసమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఘనంగా మహానగర సంకీర్తన



నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, మార్చి 18: తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం పట్టణంలో మహానగర సంకీర్తన నిర్వహించారు. హనుమాన్ సర్కిల్‌లో సత్యసాయి పల్లకికి ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు. నగర సంకీర్తనను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. అనంతరం భక్తిగీతాలు, కోలాటం, చెక్కభజన, కలశాలు, బతుకమ్మలతో నగర సంకీర్తన చేపట్టారు. ప్రశాంతి నిలయం గణేశ్ గేటు వరకు కొనసాగించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. నగర సంకీర్తనలో 2వేల మంది భక్తులు పాల్గొన్నారు.

తెలుగుకు బదులు హిందీ..!

ధర్మవరం, మార్చి 18: పది పరీక్షల నిర్వహణలో తప్పిదం దొర్లింది. తెలుగుకు బదులు ఓ విద్యార్థిని హిందీ పరీక్ష రాసింది. ధర్మవరం మండలం మోటుమర్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) నాగజ్యోతి అనే విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. కేజీబీవీ సిబ్బంది నిర్లక్ష్యంతో పది పరీక్షల హాల్ టిక్కెట్‌లో ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగుకు బదులు హిందీ అని నమోదు చేశారు. ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం తొలిరోజు నాగజ్యోతి పది పబ్లిక్ పరీక్షకు హాజరైంది. ఆమెకు తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం ఇచ్చారు. విద్యార్థిని పరీక్ష రాసింది. అంతా ముగిశాక తనకు తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం ఇచ్చారని ఇన్విజిలేటర్‌కు తెలిపింది. విద్యార్థిని హాల్ టిక్కెట్‌ను పరిశీలించగా.. ఫస్ట్ లాంగ్వేజ్ హిందీ అని ఉండటంతో విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా విద్యాశాఖ పరీక్షల నిర్వహణాధికారి లాజర్‌ను వివరణ కోరగా.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

మా పరిస్థితేంటి?

- వైసీపీలో రగులుతున్న ద్వితీయ శ్రేణి
- నాయకుల కలయికపై గుర్రు
- రహస్య సమావేశం
- పార్టీ మారే దిశగా తీర్మానం?



హిందూపురం, మార్చి 18: హిందూపురం వైసీపీలో సోమవారం ఆవిష్కృతమైన దృశ్యంతో రెండు వర్గాల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు రగిలిపోతున్నారు. హిందూపురానికి సమన్వయకర్తగా దీపిక వచ్చినప్పటి నుంచి వైసీపీ నేత నవీన్‌నిశ్చల్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు గత వారం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో దీపికా వర్గంపై మొన్నటి వరకు రగిలిన ఆయన కాస్తా చల్లబడినట్లు కనపడ్డాడు. అయినా ఈ నెల 15 వరకు ఆయనతోపాటు సోదరుడు విజయవాడలో ఉండి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని అతడి అనుచరులు కూడా చెప్పుకున్నారు. తుది జాబితాలో నవీన్ నిశ్చల్‌కే టికెట్ ఉంటుందని ఆశించారు. ఎమ్మెల్యే టిక్కెట్ దీపికాకే దక్కడంతో ఖంగుతిన్నారు. సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. నవీన్ నిశ్చల్‌తోపాటు ఎంపీ అభ్యర్థి శాంత హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ.. దీపికాను గెలిపించాలంటూ ఇప్పటి వరకు జరిగిన వాటిపై సూక్తులు వల్లెవేశారు.

కలయికతో రగలిన వైనం

మొన్నటి వరకు ద్వితీయ శ్రేణి నాయకులు దీపికా వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు. తమకే టిక్కెట్ వస్తుందనీ, ఎవరూ బెంగ పడాల్సిన అవసరం లేదంటూ నవీన్‌వర్గం చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా విలేకరుల సమావేశంలో నాయకులు అందురూ కలిసిపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు రగిలిపోయారు. మొన్నటి వరకు అందరికీ న్యాయం చేసేవరకు కలయిక ఉండదని చెప్పిన నాయకులే.. ఏకం కావడంతో ద్వితీయ శ్రేణి నాయకులు ఒక్క సారిగా అవాక్కయ్యారు. ఇక మా పరిస్థితి ఏమిటనీ, ఇలా అయితే పార్టీ మారడమే మంచిదన్న నిర్ణయానికి వస్తున్నారు.

మార్పు ఎక్కడ..?

నవీన్ నిశ్చల్ వర్గీయులకు పార్టీ పదవుల్లో న్యాయం చేస్తారని చెప్పారు. ఇదే విషయంపై ఆ నాయకుడు కూడా అనుచరులకు భరోసా ఇచ్చినట్లు సమాచారం. సోమవారం విలేకరుల సమావేశం అనంతరం ఎన్నికలు ముగిసే వరకు పార్టీ పదవులకు సంబంధించి మాట్లాడే ప్రసక్తే లేదని ఓ నాయకుడు తేల్చిచెప్పాడు. దీంతో నవీన్ వర్గీయుల్లోని కొందరు ముఖ్యులు సోమవారం రాత్రి రహస్య సమావేశం నిర్వహించారు. ఇక ఈ పార్టీలో ఉండటం కంటే వేరే మార్గం చూసుకోవడమే మేలని భావించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని మూడు మండలాలకు చెందిన నాయకులు రహస్య సమావేశంలో తీర్మానించుకున్నట్లు తెలిసింది. దీపిక, శాంత వర్గాల మధ్య కూడా అగాథం పెరిగింది. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైతం కలవలేదు. దీంతో శాంత, దీపిక వర్గాలు వేర్వేరుగా పనిచేస్తున్నాయి. వీరిద్దరు కూడా కలవడంతో ఆ రెండు వర్గాల్లో మనస్పర్థలు బయటపడ్డాయి.

ఒకరి తప్పులు ఒకరు ఎత్తిచూపుతూ..

సోమవారం విలేకరుల సమావేశం అనంతరం నవీన్ నిశ్చల్, ఎంపీ అభ్యర్థి శాంత, ఎమ్మెల్యే అభ్యర్థి దీపికాతోపాటు మరికొంత మంది ముఖ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య తీవ్ర వాగ్వాదం సాగినట్లు సమాచారం. ఇటీవల జరిగిన కార్యక్రమాలకు ఒకరినొకరిని ఆహ్వానించకపోవడంతో ఇద్దరు మధ్య కొన్ని విషయాల్లో మనస్పర్థలు వచ్చాయి. నవీన్‌నిశ్చల్ వారి మధ్య మనస్పర్థలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం సాగింది. నవీన్‌నిశ్చల్ ఇద్దరికీ సర్దిచెప్పినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ఇలా ఉంటే కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడుతుందని చెప్పినట్లు తెలిసింది. ఈ సమయంలో కొన్ని ఆర్థిక వ్యవహారాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రచారం కోసం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథంపై ఎంపీ అభ్యర్థి ఫొటో లేకపోవడంపై అభ్యంతరం తెలిపినట్లు సమాచారం.

శ్రీధర్‌రెడ్డిని మార్చాల్సిందే

- గెలిచే అభ్యర్థికే టిక్కెట్ ఇవ్వాలి
- పుట్టపర్తి వైసీపీలో ఆరని అసమ్మతి

పుట్టపర్తి, మార్చి18(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి వైసీపీలో అసమ్మతి జ్వాలలు ఆరట్లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని మార్చాల్సిందేననీ, లేదంటే ఓడిపోతారని అసమ్మతి నేతలు తేల్చిచెప్పారు. పుట్టపర్తి వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి మళ్లీ అవకాశం ఇవ్వడంపై టిక్కెట్ ఆశించి భంగపడ్డ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త సోమశేఖర్‌రెడ్డి, నాయకుడు పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, అనుచరులు సోమవారం పుట్టపర్తిలో సమావేశమై అసంతృప్తి గళం వినిపించారు. తాము ఐదేళ్లుగా పార్టీ కోసం పని చేశామనీ, తమతో కనీసం సంప్రదించకుండా అధిష్ఠానం శ్రీధర్‌రెడ్డిని ఖరారు చేయడంపై నాయకులు, కార్యకర్తలల్లో అసంతృప్తి నెలకొందన్నారు. గెలిచే అభ్యర్థికే టిక్కెట్ ఇవ్వాలనీ, లేదంటే ఓటమి తప్పదన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానం మరోమారు ఆలోచించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థిని మార్చి, తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం దృష్టికి మరోమారు తీసుకెళ్తామన్నారు. లేదంటే భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తామని తెలిపారు. దీంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ అసమ్మతి నేతలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 మంగళవారం (సాయంత్రం)	5.02 బుధవారం (ఉదయం)
కదిరి	6.31 మంగళవారం (సాయంత్రం)	5.09 బుధవారం (ఉదయం)
ధర్మవరం	6.36 మంగళవారం (సాయంత్రం)	5.06 బుధవారం (ఉదయం)
హిందూపురం	6.34 మంగళవారం (సాయంత్రం)	5.10 బుధవారం (ఉదయం)
పెనుకొండ	6.32 మంగళవారం (సాయంత్రం)	5.08 బుధవారం (ఉదయం)

మా ఇష్టం..!



పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కొత్తచెరువు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వైసీపీ ప్రజాప్రతినిదులు, నాయకులు ఖాతరు చేయడంలేదు. కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో వైసీపీ నాయకులు సమావేశమయ్యారు. వైసీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ జడ్పీటీసీ గంగాదేవి భర్త శంకర్, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాబోవు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహప్రతివ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రశాంతంగా పది పరీక్షలు



నల్లచెరువు బస్టాండులో బస్సుకోసం వేచివున్న పదో తరగతి విద్యార్థులు



నల్లచెరువు కేజీబీవీ బాలికలను మినీ వ్యాన్‌లో పరిమితికి మించి పరీక్షాకేంద్రానికి తరలిస్తున్న దృశ్యం



నల్లమాడలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు


- మొదటిరోజు 954 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థుల అవస్థలు
- నల్లచెరువులో మినీ వ్యాన్‌లో కుక్కి తరలింపు
- పలుచోట్ల బస్సులు లేక అవస్థలు

కొత్తచెరువు, మార్చి 18: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా సాగాయి. 115 కేంద్రాల్లో 23,816 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 954 మంది గైర్హాజరయ్యారు. 22,862 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని డీఈఓ మీనాక్షి తెలిపారు. దీంతో 95.99 శాతం హాజరు నమోదైందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకుని నోటీస్ బోర్డులో రోల్ నంబర్లను చూసుకుని, కేంద్రాలకు వెళ్లారు. కొందరు విద్యార్థులు చివరి నిముషాల్లో పరీక్షా కేంద్రానికి పరుగున రావడం కనిపించింది. నల్లచెరువులో కేజీబీవీ బాలికలను మినీ వ్యాన్‌లో కుక్కి, పరీక్షాకేంద్రానికి తరలించడం విమర్శలకు తావిస్తోంది. నల్లమాడలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ మీనాక్షి, జిల్లా పరీక్షల విభాగపు అధికారి లాజర్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ పరిశీలించారు.



ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలోకి పరుగు తీస్తున్న విద్యార్థిని

అడవులు బుగ్గి



మద్దివారి గొంది వద్ద అగ్నికి ఆహుతవుతున్న అడవి

గాండ్లపెంట, మార్చి 18: అడవులకు బుగ్గి అవుతున్నాయి. ఆకతాయిలు విచ్చలవిడిగా నిప్పుపెడుతుండడంతో నిలువునా కాలిపోతున్నాయి. వన్యప్రాణులు ఆశ్రయం కోల్పోయి, జనసంచారంలోకి వస్తున్నాయి. అటవీ శాఖ ఏటా రూ.కోట్లు ఖర్చు చేసి, మొక్కలు నాటుతోంది. అవి అగ్నికి ఆహుతవుతున్నా, సంరక్షించేవారే కరువవుతున్నారు. మండలంలో కొండలు, అడవులు విస్తారంగా ఉన్నాయి. నెలరోజులుగా ఏదో ఒకచోట ఆకతాయిలు నిప్పుపెడుతుండడంతో మంటలు కొండంతా వ్యాపిస్తున్నాయి. దీంతో చెట్లు, వన్యప్రాణులు, వన మూలికలు కూడా ఆహుతవుతున్నాయి. విలువైన సంపద బుగ్గి అవుతోంది. అటవీ అధికారులు అగ్ని నియంత్రణ రేఖలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నిధుల కొరతతో ఆ దిశగా చర్యలు చేపట్టలేదని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అగ్నికి అడవులను అప్పగించాల్సిన దుస్థితి దాపురించింది. అరణ్యాలు బుగ్గి అవుతుండడంతో వన్యప్రాణులు ఆశ్రయం కోల్పోతున్నాయి. గ్రామశివార్లు, జనసంచారంలోకి చొరబడుతున్నాయి. రైతులు సాగుచేసిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంటల సంరక్షణలో భాగంగా పలువురు రైతులు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తుండడంతో వాటికి చిక్కి, వన్యప్రాణులు బలవుతున్నాయి. ఇప్పటికే మండలంలోని దేరకొండ, బొగాదమ్మ కొండ, చామాలగొంది, మద్దివారి గొంది తదితర అడవులు నెలరోజులుగా అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇప్పటికైనా అటవీఅధికారులు మేల్కొని, అడవులను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మరో చాన్స్

ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం

యువతకు అవకాశం కల్పించేందుకే..



పుట్టపర్తి, మార్చి 18: సార్వత్రిక ఎన్నికలు ఆలస్యం కావడంతో కొత్తఓటర్లకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో సారి అవకాశం కల్పించింది. గతంలో జనవరి 1 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అయితే ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో దాన్ని ఏప్రిల్ 15 వరకు పొడిగించారు. అవసరమైన వారు ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యువత ఆన్‌లైన్ ద్వారా లేదా ఆయా మండల కేంద్రాలలో ఎన్నికల అధికారులకు ఫారం-6ను అందజేయాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించి ఏప్రిల్ 25లోగా కొత్త ఓటరుగా నమోదు చేస్తారు.

యువ ఓటర్లు 26 వేల మంది

ఇప్పటికే జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు హక్కును కల్పించారు. వీరు 26వేలకుపైగా ఉన్నారు. మొదటి సారి ఈఏడాది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చేర్పులు, మార్పులు లేవు

ప్రస్తుతం కొత్తగా ఓటు నమోదుకు మాత్రమే అవకాశం ఉంది. చేర్పులు, మార్పులకు ఎలాంటి అవకాశం లేదు. ఫారం-7, ఫారం-8 ద్వారా తొలగింపులు, మార్పులు, చేర్పులు చేసేవారు. ప్రస్తుతం కేవలం ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు హక్కుకు మాత్రమే అవకాశం కల్పించారు.

కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నాల్గవ విడతలో జరుగుతుండటంతో కొత్తగా అర్హులైన వారు ఏప్రిల్ 15లోగా ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 25లోగా అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తాం.



కొండయ్య, డీఆర్వో

సారూ..! రోంత జాగర్త

- ఎన్నికలవేళ కోడ్ అమలు
- పార్టీలకు ప్రచారాలు చేస్తే కుదరదు
- ఉద్యోగుల సామాజిక మాధ్యమాలపై నిఘా



అనంతపురం టౌన్, మార్చి 18 : ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. కోడ్ కూసింది. ఇప్పటివరకు ఉద్యోగుల పరిస్థితి ఒకలెక్క.. ఇప్పటి నుంచి మరోలెక్కలా ఉంటుంది. గతంలో తమకు ఇష్టమొచ్చినట్లు రాజకీయ పార్టీలకు మద్దతుగా మాట్లాడి ఉండవచ్చు.. వారికి మద్దతుగా వ్యవహరించి ఉండవచ్చు.. కానీ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేసింది. ఇప్పుడు అవన్నీ కుదరవు. గతంలో మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగులు తమ అభిప్రాయాలను ఇష్టారాజ్యంగా ప్రచారం చేస్తామంటే కుదరదని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ జీతాలు పొందే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సైతం పార్టీలకు మద్దతుగా ప్రచారం చేయకూడదు. సామాజిక మాధ్యమాలలోకూడా తమ అభిప్రాయాలను పోస్టు చేయకూడదు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

అధికార పార్టీకి అనుకూలంగా ఐకేపీ, డ్వామా ఉద్యోగులు, వలంటీర్లు

జిల్లాలో కొందరు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అధికార వైసీపీకి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఐకేపీ, డీఆర్‌డీఏ, డ్వామా ఉద్యోగులు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో వెళ్లడంతో పాటు వారికి ఓటువేయాలని ప్రచారం చేస్తున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఐకేపీ, డ్వామా ఉద్యోగులు, వలంటీర్లు స్వయంగా పాల్గొని వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. సమావేశాలుపెట్టి బెదిరిస్తున్నారని కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారుల సహకారం, అండ ఉండడం వల్లనే వారు బరితెగించి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. వలంటీర్లకు ప్రభుత్వమే జీతాలు ఇస్తోంది కాబట్టి వారుకూడా ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలి. కానీ అధికార వైసీపీ ఏజెంట్లుగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఎన్నికల విధులకు వలంటీర్లను వినియోగించుకోకూడదని ఇప్పటికే ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినా వారిని నియంత్రించే అధికారులు కనిపించడంలేదు.

ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

ఉద్యోగుల విషయంలో ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే అనేక ఫిర్యాదులు వెళ్లాయి. కొందరిపై ఆధారాలతో సహా ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేశాయి. కానీ అధికార పార్టీ నేతలు తామున్నామంటూ హామీలు ఇవ్వడంతోపాటు ఉన్నతాధికారులు సైతం మౌనంగా ఉండిపోతుండడంతో ఐకేపీ, డ్వామా, వలంటీర్ల వ్యవహారాలు మితిమీరిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగానే కాదు పరోక్షంగా రాజకీయ పార్టీలకు ప్రచారాలు చేసినా, తమ అభిప్రాయాలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ఎన్నికల కమిషన్ కూడా ఉద్యోగుల విషయంలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. రాబోయే రెండు నెలల పాటు ఉద్యోగులు జాగ్రత్తగా ఉండకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా హెచ్చరించిన విషయం విదితమే.

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



స్వాగత తోరణాలు

కదిరి, మార్చి 18: ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకుర్పారణతో మొదలై ఏప్రిల్ 2న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. పక్షం రోజులపాటు కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా చూసేందుకు కదిరి ప్రాంతంనుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాదిమంది తరలివస్తారు. బ్రహోత్సవాలకు ప్రతి సంవత్సరం భక్తులు ముడుపులు కట్టి, వేచి చూస్తుంటారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహినోత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. ఈఉత్సవాల్లో ప్రతిరోజు వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి: శ్రీనివాసరెడ్డి, ఈఓ

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, ఉచిత భోజన సదుపాయాన్ని ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డిమాండ్



వైసీపీ ఎన్నికల ప్రచారంలో వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్ (వృత్తంలో వ్యక్తి)

శింగనమల, మార్చి 18: వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్‌పై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ కోరారు. మండలంలోని చిన్న జలాలపురం గ్రామానికి చెందిన పట్నం భాస్కర్ వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్నాడు. పుట్లూరు మండలంలో శనగలగూడురు, తిమ్మాపురం, పి.చింతలపల్లి, గోవరాజుపల్లి, సి.యంగన్నపల్లి గ్రామాల్లో జరిగిన ఎన్నిక ప్రచారంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా ఆ ఫీల్డ్ అసిస్టెంట్ వారి తరపున ప్రచారం చేశాడన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

వైసీపీ కార్యక్రమంలో వలంటీర్



శింగనమలలో జరిగిన వైసీపీ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్ వెంకటేశ్

శింగనమల, మార్చి 18: ఎన్నికల అధికారులు పదే పదే చెబుతున్నా గ్రామ వలంటీర్లు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారు. శింగనమలలో రామస్వామి దేవాలయంలో వైసీపీలో పదవులు పొందిన నాయకులకు సన్మాన కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న జలాలపురం గ్రామానికి చెందిన వలంటర్ వెంకటేశ్ పాల్గొని వారిని సన్మానించాడు.

రైళ్లలో జీఆర్పీ ఎస్పీ తనిఖీలు

గుంతకల్లు, మార్చి18: వేసవి ప్రారంభం కావడంతో జీఆర్పీ ఎస్పీ సోమవారం గుంతకల్లు-నంద్యాల సెక్షన్‌లో విస్తృత తనిఖీలను నిర్వహించారు. ఉదయం గుంతకల్లు స్టేషన్ మొదలుకుని డోన్, నంద్యాల స్టేషన్లలోనూ, రైళ్లలోనూ అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికులను ప్రశ్నించారు. లగేజిని తనిఖీచేశారు. కిటికీల వద్ద ఉన్న మహిళా ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని, తమ లగేజిని జాగ్రత్త చేసుకోవాలని, అపరిచితులతో మాటలు కలపరాదని, వారిచ్చే తినుబండారాలను తీసుకోరాదని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కర్నూలుకు వెళ్లి రైళ్లు, స్టేషన్లలో తనిఖీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ వేళ జడ్పీలో బదిలీల గోల

- తాజాగా నలుగురు ఉద్యోగులకు స్థానచలనం
- ఎన్నికల కోడ్ రావడానికి ముందే ఉత్తర్వులు
- ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు
- బుసలు కొడుతున్న జిల్లా బ్యూరోక్రసీ



అనంతపురం విద్య, మార్చి 18: జిల్లా పరిషత్‌లో ఎన్నికల కోడ్ వేళ అనూహ్యంగా అధికారులు, ఉద్యోగుల డెప్యుటేషన్లు, వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో బదిలీల వ్యవహారం నడుస్తోంది. ఉన్నఫలంగా జడ్పీ నుంచి కొందరిని బయటకు పంపడం, మరికొందరిని జడ్పీకి తేవడం, పైగా కోడ్ వచ్చిన వెంటనే వేగంగా ఉత్తర్వులు బయటకు వస్తుండటంపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ బదిలీల వ్యవహారం మొత్తం ఎన్నికల కోడ్ రావడానికి ముందే నడిచినా...ఉత్తర్వుల కాపీలు మాత్రం కోడ్ కూసిన తర్వాత రావడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల కిందట డిప్యూటీ సీఈఓని బదిలీ చేసి...కొత్త అధికారిని నియమించారు. ఇటీవల పాలకవర్గం సభ్యులు ఆమెను సరెండ్ చేయాలని డిమాండ్ చేయడంతో... గుంతకల్లు డీఎల్‌డీఓగా డెప్యుటేషన్‌పై కలెక్టర్ పంపారు. అదే అనూహ్యం అనుకుంటుంటే జడ్పీ పరిధిలోని మరో నలుగురు అధికారులను ఉన్నఫలంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) కింద బదిలీ చేస్తూ.. జడ్పీ సీఈఓ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) షబీర్ నియాజ్‌ను శెట్టూరు ఎంపీడీఓ ఆఫీస్‌కు, పామిడిలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హరనాథ్‌ను జడ్పీ కార్యాలయానికి, జడ్పీలోని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును అమరాపురం ఎంపీడీఓ ఆఫీస్‌కు, పుట్టపర్తి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పీఐయూ) ఆఫీస్‌లోని సీనియర్ అసిస్టెంట్ కేశవ్‌ను జడ్పీ కార్యాలయానికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద బదిలీ చేశారు.

మరికొందరిపై వేటు తప్పదా..?

జడ్పీలో మరికొందరిపై వేటు వేయడం ఖాయం అన్నట్టు సమాచారం. గత కొంతకాలంగా జడ్పీ పాలకవర్గం వర్సెస్ జిల్లా బ్యూరో క్రసీ అన్నట్టుగా సాగుతోంది. ఈ క్రమంలో ఇన్నాళ్లు పాలకవర్గంలోని కీలక నేతలు, జడ్పీటీసీ సభ్యులు తమను జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశాల్లో టార్గెట్ చేశారని ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందని...ఇక తామేంటో చూపిస్తాం అన్నట్టుగా జిల్లా బ్యూరోక్రసీ తమ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే తమ పంతం నెగ్గించుకోవడంలో భాగంగా...జడ్పీ నుంచి కొందరు అధికారులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం, మరికొందరికి జడ్పీకి తీసుకొచ్చినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఇన్నాళ్లు ఉద్యోగుల పక్షాన, బ్యూరోక్రసీకి వ్యతిరేకంగా గళం విప్పిన ఇతర అధికారులపై వేటు వేసేందుకు యత్నాలు సాగుతున్నట్టు సమాచారం. బుసలు కొడుతున్న బ్యూరోక్రసీ త్వరలో జడ్పీలోని మరికొందరిపై కూడా బదిలీల వేటు వేయడం ఖాయం అంటూ జడ్పీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరి తర్వాత వచ్చే లిస్టులో ఎవరెవరు ఉంటారో అంటూ... కొందరు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

చిరుత మృతి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 18 : శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామ సమీపంలోని దుప్పర్లగుట్టలో అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి చెందింది. ఈ విషయాన్ని గమనించిన గొర్రెల కాపరులు గ్రామస్థులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వేసవికాలం మొదలైన నేపథ్యంలో అటవీ ప్రాంతంలో తాగునీరు లభించక, ఎండవేడిమితో చనిపోయి ఉండవచ్చని చెబుతున్నారు. చిరుత మృతి చెంది దాదాపుగా ఎనిమిది రోజులైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. చిరుత మృతి పై అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతోనా లేక తాగునీరు లేక మృతి చెందిందా అనే పూర్తి సమాచారం ఫోరెన్సిక్ రిపోర్ట్‌లో తేలనుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వ్యాపారవేత్తపై హత్యాయత్నం



గోపాలకృష్ణను పరామర్శిస్తున్న టీడీపీ నాయకుడు ఈరన్న

మడకశిరటౌన్, మార్చి 18: పట్టణానికి చెందిన కొందరు తనపై సోమవారం రాత్రి వేటకొడవళ్లతో దాడిచేసి హత్యకు యత్నించినట్లు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గోపాలకృష్ణ తెలియజేశారు. బాధితుడు తెలిపిన మేరకు పట్టణ సమీపంలోని మధుగిరిరోడ్డు మారుతీనగర్‌లో ప్రధాన రహదారి పక్కన తనకు కొంత భూమి ఉందన్నారు. అందులో వేరుశనగ కాయల మిల్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఆరేళ్ల కిందట రెవెన్యూ శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొందరు ఉద్యోగులు తన పట్టా భూమిలో దాదాపు 22 సెంట్లకు వన్- బీ చేయించి ఓ వ్యక్తికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించాన న్నారు. ఆ వ్యక్తి సోమవారం రాత్రి ఉన్నట్టుండి కొందరు వ్యక్తులతో కలిసి వచ్చి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి గేటు ఏర్పాటు చేశాడన్నారు. విషయం తెలుసుకుని అడ్డుకోవడానికి వెళ్లిన తనపై కొడవలి, రాడ్లతో దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిని తనను వేరుశనగ మిల్లులో పనిచేసే కూలీలు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి తలకు బలమైన గాయాలు కావడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మద్దనకుంట ఈరన్న మడకశిర ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మనోహర్ తెలిపారు.

ఈవీఎంలు పరిశీలించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టరు గౌతమి సోమవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితోపాటు పలుపార్టీల ప్రతినిధులతో కలిసి గోదాం తాళాలు తీయించారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా నుంచి వచ్చిన 98 ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇద్దరు ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈచెకింగ్ చేపట్టారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సజావుగా చెకింగ్ కార్యక్రమం చేపట్టాలని కలెక్టరు ఆదేశించారు. అలాగే ఇతర ఈవీఎంలు వాటిభద్రతను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



గోదాంలో పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి తదితరులు

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా ?

కణేకల్లు, మార్చి 18: మండలంలోని కొత్తపల్లి రహదారి మరమ్మతుల గురించి ఇన్నాళ్లకు గుర్తొచ్చినట్లు ఉంది. ఐదేళ్లుగా ఈ రహదారి గుంతలతో కూడి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పుడు ఏ నాయకుడు పట్టించుకోలేదు. ఇప్పుడు ఏమి బుద్ధి పుట్టిందో ఏమో గుంతల రోడ్డుపై మట్టి తోలుతున్నారు. కొత్తపల్లికి చెందిన వైసీపీ నాయకుడు సోమవారం ట్రాక్టర్ ద్వారా గుంతలమయమైన రోడ్డుకు యర్రమట్టిని తోలించాడు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలపై కపట ప్రేమను చూపుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



గుంతలపై తోలిన ఎర్రమట్టి

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

అనంతపురం క్లాకటవర్, మార్చి 18 : తెలుగు రాష్ట్రాల్లో నిరుపేదలకు 50 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ వెంటనే రెన్యువల్ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ఆయన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆర్డీటీని సమష్టిగా పోరాడి కాపాడుకుందామని కోరారు. విదేశాల నుంచి దాతలు అందిస్తున్న విరాళాల సేకరణకు అనువుగా ఫారిన్ కంట్రిబ్యూటరీ రెగ్యులేటరీ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ)ను కేంద్రప్రభుత్వం వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసే కేంద్రప్రభుత్వం... ఈ ఏడాది ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకుండా నిలపడం దారుణమన్నారు. రాయలసీమతో పాటు తెలంగాణలో సైతం సేవలందిస్తున్న ఆర్డీటీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్ మహ్మద్, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, ఏఐఎంఎస్ జిల్లా కన్వీనర్ పుల్లయ్య, ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, ఆశ్రయ సంస్థ కృష్ణారెడ్డి, మాలమహానాడు గంగాధర్, బీసీ సంఘం హరి, ఎస్ఎస్‌యూఐ నరేష్, సమాజ్‌వాది పార్టీ బాబా, ఆర్‌ఈఎఫ్ శ్రీరాములు, నాయకులు ఓబుళపతి, రాజ్‌కుమార్, అమర్, అనీల్, మల్లికార్జున, వెంకటనారాయణ, మల్లేష్, రాజు మద్దతుగా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బత్తలపల్లి, మార్చి 18: మండలకేంద్రం సమీపంలోని నార్శింపల్లికి వెళ్లే దారిలో విద్యుదాఘాతంతో శ్రీరాములనాయుడు (30) ట్రాన్స్‌ఫార్మర్‌పైనే మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన మేరకు బత్తలపల్లికి చెందిన రైతు వెంకటనారాయణ వ్యవసాయ తోట వద్ద ట్రాన్‌ఫార్మర్ స్తంభంపై సోమవారం సాయంకాలం శ్రీరాములు నాయుడు మృతదేహం వేలాడుతూ రైతుకు కనిపించింది. ఆయన వెంటనే పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ శ్రీనివాసులు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని కిందకు దింపారు. మృతుడిపై ఉన్న చొక్కా జేబును పరిశీలించగా స్పానర్, ఆక్సాబ్లేడ్ దొరికాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ దొంగిలించేందు మృతుడితో పాటు మరి కొందరు వచ్చి ఉంటారని పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు పుట్టపర్తి మండలం ఎనుములపల్లి గ్రామానికి చెందిన సంజీవనాయుడు కుమారుడు శ్రీరాములనాయుడుగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య పుష్ప, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్యుమెంట్ పోయినది

M/s మాచాని రమేష్ హోల్డింగ్స్ & కో. కు ప్రాతినిధ్యం వహించు శ్రీ గణేష్ కామత్ .కె (ఆధార్ కార్డ్ నం.6687 4320 7968)తండ్రిరామదాస్ కామత్ , వయస్సు 65 సంవత్సరాలు, నివాసం డి.నం:65/3 మంగమ్మన పాల్య బెంగళూరు సౌత్, బొమ్మనహళ్లి, బెంగళూరు కర్నాటక-560068, వారు ప్రమాణం చేస్తూ దిగువ విధంగా ధృవీకరించడమైనది ఏమనగా కంపెనీ పేరు మీద నమోదైనటి చెన్నెకొత్తపల్లి మండలం, న్యామదల రెవిన్యూ గ్రామం, గ్రామపొలం, సర్వే నం.193-1A, 193-2లో విస్తీర్ణ ఎ.1.20 సెంట్ల మొత్తం సి.కె.పల్లి ఎస్ఆర్ఓలో రిజిస్టరు అయిన యొక్క విక్రయ దస్తావేజు గల డాక్యుమెంట్ నం.322/2021, తేది:02.03.2021 కలిగిన డాక్యు మెంట్ పోగొట్టుకున్నారు మరియు నేను ఇందులో డిపోనెంట్ అని తెలియ జేయడమైనది.పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్‌ను 11.03.2024న నా న్యామద్దల ఫ్యాక్టరీ నుండి సి.కె పల్లికి, సి.కె.పల్లి బస్‌స్టాండ్ సర్కిల్ వద్ద జిరాక్స్ సెంటర్ మధ్యన బైక్‌లో ప్రయాణించు సమయంలో డాక్యుమెంట్ పోగొట్టుకున్నాను. నేను ఎంత ప్రయత్నించినా నేను దానిని గుర్తించలేక పోయాను మరియు అది కనిపెట్ట దానికి వీలు లేకుండా పోయినది. ఒకవేళ భవిష్యత్తులో ఇది కనుగొనబ డినట్లయితే, భవిష్యత్తులో ఏవైనా కేసులకు నేను బాధ్యత వహిస్తానని, తదుపరి లావాదేవీల కోసం దయచేసి ఈ అఫిడవిట్‌ను అంగీకరించమని కోరుతున్నాను.పై పేరాలలో చెప్పబడినవి చదవడం మరియు నాకు తెలుగులో వివరించడం జరిగింది మరియు నా విచక్షణ, నమ్మకం మరియు సమాచారం మేరకు అదే నిజమని మరియు సరైనదని అంగీకరిస్తా

ఐ.అహ్మద్ అడ్వకేట్, అనంతపురం.

తాగునీటి సమస్య తీర్చాలంటూ మహిళల ఆందోళన



రోడ్డుపై ఖాళీబిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

కళ్యాణదుర్గం, మార్చి 18: తాగునీటి సమస్య తీర్చాలంటూ రోడ్డుపై ఖాళీ బిందెలతో పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. కంబదూరు మండలంలోని అండేపల్లి గ్రామంలో సోమ వారం మహిళలందరూ ఖాళీబిందెలు చేతపట్టి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. రోడ్డుపై ముళ్లకంపలు వేసి వాహనాలను ఆపివేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించి ఆందో ళన చేపట్టడంతో వాహనాలన్నీ నిలిచిపోయాయి. గత కొన్ని నెలల నుంచి గ్రామంలో తాగునీటి కష్టాలు వున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో సమస్యను అడిగితెలుసుకున్నారు. నీటి సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని పోలీసులతో మహిళలు వాదించారు. చివరికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరిస్తామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

గుత్తి, మార్చి 18: పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 820గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణ శివారులోని కొత్తపేట బ్రిడ్జి సర్వీసు రోడ్డులో ఇరువురు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారని సమాచారం మేరకు తాను, ఎస్ఐ నబీ రసూల్, సిబ్బందితో దాడులు నిర్వహించి గంజాయి అమ్ముతున్న పట్టణంలోని ఎస్సీకాలనీకి చెందిన సూరిపోగుల సాయికుమార్, వడ్డెవిజయ్ అలియాస్ బెగ్గర్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 820 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.



రామాపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

ముమ్మరంగా పల్లె ఎన్నికల ప్రచారం

నల్లమాడ, మార్చి 18: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో గల రామాపురం, నేరాలవంకతండా, రెడ్డికుంట తండా, బాపనకుంట గ్రామాల్లో సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామాల్లో అందరూ సమష్టిగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యలు, పక్కాగృహాలు, పింఛన్లు తదితర వాటిని ఆయన దృష్టికి తెచ్చారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అయిన పల్లె సింధూరా రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, గడ్డం రమణారెడ్డి, వెంకటరమణనాయుడు, కులశేఖర్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్రహాస్ రెడ్డి, మైలే రామచంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి పని చేయండి.. ప్రాధాన్యం కల్పిస్తా

● వడ్డెర నాయకులకు చంద్రబాబు హామీ



మంగళగిరిలో చంద్రబాబుతో సమావేశమైన వడ్డెర నాయకులు

పుట్టపర్తి రూరల్, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని, తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలిపినట్లు వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళగిరిలోని కేంద్రపార్టీ కార్యాలయంలో సోమవారం సంఘం నాయకులు మల్లెల జయరాం, వడ్డేవెంకట్, సిమెంట్ పోలన్న తదితరులు చంద్రబాబును కలిసి మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వడ్డెర్లకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరామని, జనాభా పరంగా అధిక శాతం ఉన్న తమకు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని కోరామని తెలిపారు. ఇందుకు బాబు మాట్లాడుతూ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, టికెట్ రాలేదని నిరాశ పడవద్దని, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సముచిత స్థానం కల్పి స్తామని భరోసా ఇచ్చారన్నారు. అవినీతి వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రతిఒక్కరు పనిచేయాలని సూచించారన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం ఉమ్మడిజిల్లా ఉపాధ్యక్షుడు పల్లెపు జయ చంద్రమోహన్, నాయకులు దలవాయి వెంకటనారాయణ, జరిపిటి కృష్ణమూర్తి, తన్నూరి ఆంజనేయులు, రమాదేవి, నాగార్జున, మల్లెల ఈశ్వర్, తిరుపాల్, తురక వీరస్వామి, మారెప్ప ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 18: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం చేపట్టిన దాడుల్లో ధర్మవరం పట్టణంలోని సిద్దయ్యగుట్ట కాలనీలో పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో గల ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. 15 సంచుల బియ్యాన్ని క్వాలీస్ వాహనంలో స్టోర్ చేస్తుండగా తనిఖీలు చేపట్టి సీజ్ చేశారు. అనంతరం షేక్ బాబావలిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీకి అప్పగించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసు ప్రకాస్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కమిటీ నియామకం

కదిరి, మార్చి 18: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. 11మందితో సోమవారం కమిటీ నియమించారు. వీరు 19-3-2024నుంచి 2-4-2024వ తేదీ వరకు కమిటీ సభ్యులుగా ఉంటారు. విశ్వనాథ్‌రెడ్డి, నామా వెంకటరామప్రసాద్, లింగాల లోకేశ్వర్‌రెడ్డి, బీ. ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణనాయక్, గంగాధర్, శాంతమ్మ, భాగ్యలక్ష్మి, త్రివేణి, చండీప్రియ, శ్రీదేవిని నయమించినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

20న కలెక్టర్ పట్టు వస్త్రాల సమర్పణ

ఈనెల 20వ తేదీన జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2014 నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోందన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పించే జీవో తీసుకొచ్చినట్లు చెప్పారు.

కింద పడి వ్యక్తి మృతి

ముదిగుబ్బ, మార్చి18: మండలంలోని రాళ్లఅనంతపురం క్రాస్ సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై సోమవారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన జిలాన్(50) ముదిగుబ్బ మండలంలోని రాళ్ళఅనంతపురం క్రాస్ దగ్గర ఒక గోడౌన్‌కు వెల్డింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రైవేటు వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ, మార్చి18: మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ యతీంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉండడం వల్ల బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు ప్రైవేట్ పాఠశాలల యాజమానులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం



దుగినేపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, మార్చి 18: మండలంలోని కోటపల్లి, దుగినేపల్లి గ్రామాల్లో సోమవారం సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, సోముశేఖర్, సుధాకర్, గంగాద్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

● ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూరారెడ్డి



నాగిరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, మార్చి 18: వైసీపీ పాలనలో పుట్టపర్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ముఖ్యంగా రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నా.. ఏమాత్రం పట్టించుకోలేదని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, వంగం పల్లి గ్రామాల్లో సోమవారం ఆమె భర్త పల్లె వెంకట కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రోడ్‌షో చేపట్టారు. గ్రామాల్లోకి రాగానే.. మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్, టీడీపీ, జనసేన నాయకులు నాగేంద్ర, ప్రసాద్, గంగాధర్, పూలశివ, గాజులనాగేంద్ర, చింతలప్ప తదితరులు బాణా సంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం పల్లెసింధూరారెడ్డి అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. గతంలో వంగంపల్లికి రావాలంటే బ్రిడ్జి లేక తలమర్ల, మీర్జాపురం పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు వారి ఇబ్బందులను గుర్తించి అప్పట్లో మంత్రిగా ఉన్న పల్లెరఘునాథరెడ్డి రూ.4కోట్ల వ్యయంతో బ్రిడ్జినిర్మించారన్నారు. అలాగే ఇరగంపల్లి నుంచి తలమర్లకు రోడ్డును మంజూరు చేయించారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిచినా ఆ రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాడైన ఇతర రోడ్లను పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పదవీకాలం పూర్తయ్యే సమయంలో తన ఉనికిని చాటు కోవడానికి 193చెరువులకు నీరు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఐదేళ్లు నీరివ్వకుండా ఏమి చేశావని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. రాబోవుఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే రోడ్లు వేయడంతోపాటు రెండు పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరందిస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. ఆయన ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. అనంతరం స్థానిక వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతర్

● గ్రామాల్లో అధికారపార్టీ జెండాలు, స్టిక్కర్లు ● తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం



పోతులనాగేపల్లిలో విద్యుత్‌స్తంభానికి అలాగే ఉన్న ఎమ్మెల్యే స్టిక్కరు



చిగిచెర్లలో చెరపని ఫ్యాన్ గుర్తు



నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో అలాగే ఉన్న వైసీపీ ఫ్లెక్సీ



కదిరి మండలం వీరేపల్లి పేటలో ముసుగు పడని వైఎస్ విగ్రహం

ధర్మవరంరూరల్, మార్చి18: ఎన్నికల కోడ్ వచ్చి 48గంటలు గడిచినా ఇంకా గ్రామాల్లో అధికారపార్టీకి సంబంధించి గోడలపై రాతలు, విద్యుత్‌స్తంభాలకు స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్‌లో విద్యుత్‌స్తంభాలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గెలిపించండి అంటూ స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. చిగిచెర్ల గ్రామంలో గోడరాతలు, ఎమ్మెల్యే స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. దీంతో అధికారులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల విధులను కూడా తూతుమంత్రంగా నిర్వహిస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో అధికారులు ఎన్నికల నిబంధనలను బేఖాతారు చేశారు. రెడ్డిపల్లి ప్రధాన రహదారిలో వైసీపీ ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగనన్న అనే పోస్టర్లు దర్శనమిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినతరువాత అన్ని పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. అది మండలంలో మాత్రం పాటించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కదిరిఅర్బన్: అధికారులు ఎన్నికల నియమాలను అమలు చేయడంలేదు. ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన వాటిని ఆగమేఘాల మీద తొలగించిన అధికారులు, అధికార పార్టీకి చెందిన వాటిని తొలగించడంతో అలసత్వం వహిస్తున్నారు.



ముదిగుబ్బలో రెండో సచివాలయానికి తొలగించని హోర్డింగ్

ఇందుకు నిదర్శనం కదిరి మండలంలోని వీరేపల్లి పేట గ్రామంలోని వైఎస్ విగ్రహానికి ముసుగు వేయలేదు. ఎన్నికల నిబంధనలు పాటించకపోవడం ఏమిటని ప్రజలు చర్చించుకున్నారు.

ముదిగుబ్బ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రెండు రోజులవుతున్నా పలు చోట్ల హోర్డింగ్‌లను సంబంధిత అధికారులు అలాగే వదిలేశారు. మండల కేంద్రంలో నూతనంగా 2వ సచివాలయాన్ని నిర్మించారు. ప్రారంభం కూడా కాని ఆ సచివాలయానికి మా నమ్మకం నువ్వే జగన్ అనే హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే వైసిపి కార్యాలయానికి ఉన్న హోర్డింగ్‌ను కూడా సంబంధిత అధికారులు తొలగించలేదు.

వైసీపీ స్టిక్కర్లను తొలగించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వైసీపీకి చెందిన స్టిక్కర్లు గోడలపై, విద్యుత్‌స్తంభాలపై అలాగే ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు ఆర్డీఓ వెంకటశివారెడ్డికి విన్నవించారు. సోమవారం నాయకులు డిష్ రాజు, గొట్లూరుచంద్ర, చిలకంసూర్యనారాయణరెడ్డి, నబీరసూల్, నారాయణస్వామియాదవ్, మార్కెట్ రహీం, వీరన్న, రాప్తాటిరాము, బోడగలగిరిధర్, గంధమనేని నారాయణస్వామి ఆర్డీఓతో పాటు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌ను వేరువేరుగా కలిసి వినతి పత్రం ఇచ్చారు. వైసీపీకి చెందిన హోర్డింగ్స్ ఇళ్ల మీద, షాపులవద్ద ఉన్నాయని వాటిని తొలగించాలని వినతి పత్రంలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

భారీ మెజార్టీతో గెలుస్తాం: కందికుంట

కదిరి, మార్చి 18: ఈ సారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో సోమవారం ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత రెండు ఎన్నికల్లో ఓటమిపాలయ్యాయమని, దానికి ప్రతిగా వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి ప్రత్యర్థులకు సమాధానం చెబుదామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు తమకు కేటాయించిన బూత్‌లలో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. గత ఎన్నికల్లో బూత్‌ల వారీగా మెజార్టీ బేరీజు వేసుకుని, తగ్గిన చోట ఎందుకు తగ్గిందో కారణాలు తెలుసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు తమ బూత్ పరిధిలలో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలన్నారు. అందరూ సమష్టిగా పని చేస్తే విజయం సాధించవచ్చన్నారు. ప్రచారాన్ని ఉధృతంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పది కుటుంబాల చేరిక



కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న తండావాసులు

నల్లచెరువు: మండలంలోని రాజం వాండ్లపల్లి తండాకు చెందిన పది కుటుంబాల వారు సోమవారం టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం వారు నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో శివనాయక్, ముత్యాలమ్మ, రమణనాయక్, గుండానాయక్, బీమ్లానాయక్, అంజునాయక్, వినోద్ నాయక్, జయనాయక్‌తోపాటు పదికుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట రమణ, మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు గోవిందునాయక్, సోమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

యశోదమ్మను కలిసిన ధర్మవరం నాయకులు



కందికుంట యశోదమ్మను కలిసిన ధర్మవరం టీడీపీ నాయకులు

ధర్మవరం, మార్చి 18: కదిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కందికుంట యశోదమ్మను సోమవారం సాయంత్రం ధర్మవరం పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు కలిశారు. కదిరిలోని కందికుంట స్వగృహంలో వారు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికలలో అత్యధిక మెజారిటీ గెలుపొందాలని భగవంతున్ని ప్రార్థించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధనసుబ్బయ్య, గోసలశ్రీరాములు,మారుతీస్వామి, మాధవరెడ్డి, తొగటఅనిల్, నాగేంద్ర, చెలిమిశివరాం, బీరేశీన, వాసుదేవ ఉన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



అనంతపురం జిల్లాకోర్టు న్యాయాధికారికి వినతి పత్రం అందజేస్తున్న పుట్టపర్తి బార్‌అసోసియేషన్ సభ్యులు

పుట్టపర్తి రూరల్, మార్చి 18: జిల్లాకేంద్రంలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా ఉందని పుట్టపర్తి జూనియర్ సివిల్‌కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకోర్టులో సోమవారం ఆయన జిల్లా పోర్టుపోలియో న్యాయాధికారి శ్రీనివాస్‌కు జిల్లాకోర్టు ఏర్పాటుపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందుకు సంబంధించి టెరిటోరియల్ జ్యూరిసిడెక్షన్ ప్రతిపాదనలు పంపాలని హైకోర్టు న్యాయమూర్తి జిల్లా పోర్టు పోలియో జడ్జి మన్మథరావును గతంలో కోరిందని, అందుకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలను ఇప్పటికే పుట్టపర్తి బార్ అసోసియేషన్ జిల్లా న్యాయాధికారికి అందచేసిందని తెలిపారు. జిల్లా కోర్టు ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు లెక్కల యదుభూషణ్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

ముదిగుబ్బలో పోలీసుల కవాతు

ముదిగుబ్బ, మార్చి18: సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మండలకేంద్రంలో సోమవారం సీఐ యతీంద్ర ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్, ఆర్మీ బలగాలతో పాటు పోలీసులు కవాతు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా పాతవూరి వరకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

మొదటి రోజు.. పది పరీక్షలు ప్రశాంతం

ధర్మవరం, మార్చి18: పట్టణంలో సోమవారం మొదటిరోజు నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆదేశాలుండడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులతో గంట ముందుగానే చేరుకున్నారు. పట్టణంలోని 10 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాశారు. 2652 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఇందులో 2544 మంది హాజరయ్యారు. 108 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-1,2 రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు.

కదిరిఅర్బన్: పట్టణ, రూరల్ పరిధిలోని 11 కేంద్రాల్లో పది పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికలపాఠశాల - ఏ, బీ సెంటర్లలో 337మందికి గాను అందరూ హాజరై పరీక్ష రాశారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఏ సెంటర్‌లో 177కు మందికి గాను 176 మంది. బీ సెంటర్‌లో 167మందికి గాను 166 మంది, కుటాగుళ్ల మున్సిపల్ పాఠశాలలో 238కి గాను 228 మంది, వీవర్స్‌కాలనీ మున్సిపల్ పాఠశాలలో 254కి గాను 236 మంది పరీక్ష రాశారు. కస్తూరిబాలో 168కి గాను 166 మంది పరీక్ష రాశారు. మున్సిపల్ ఉర్దూ మెయిన్‌లో స్కూల్ సెంటర్‌లో 163మంది పరీక్ష రాశారు. ట్రైబుల్ బాలికల పాఠశాలలో 236కి గాను 229 మంది, రూరల్ పట్నం జిల్లాపరిషత్‌లో 139కిగాను 129మంది, కుమ్మవాండ్లపల్లి జిల్లాపరిషత్‌లో 236కుగాను 225మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ చెన్నక్రిష్ణ తెలిపారు.

బత్తలపల్లి: మండలకేంద్రంలో పది పరీక్షలు సజావుగా జరిగాయి. స్థానిక బాలుర పాఠశాల, బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 477 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 10 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. బాలుర పాఠశాలలో కొన్ని గదుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో ఉక్కపోతతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

గాండ్లపెంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల -2 కేంద్రంలో 235మంది పరీక్ష రాశారని, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, అలాగే సప్లిమెంటరీ రాస్తున్న వారు 17మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. కేజీబీవీలో 108మందికి గాను అందరూ పరీక్ష రాశారన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి బందో బస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు.

నల్లచెరువు: మండలపరిధిలోని మోడల్‌స్కూల్‌లో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మండల వ్యాప్తంగా 360మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ తిరుపాల్ నాయక్ తెలిపారు. ఉదయం 9.30నుంచి 12.45 నిమిషాలవరకు పరీక్షలు జరిగాయన్నారు. ఉబిచెర్ల, నల్లచెరువు, కస్తూరిబా పాఠశాలల నుంచి విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడానికి నానా తంటాలు పడ్డారు. కస్తూరిబా పాఠశాల నుంచి విద్యార్థినులను టాటా ఏస్ వాహనంలో పరిమితికి మించి ఎక్కించుకుని పరీక్ష కేంద్రం వద్దకు తీసుకొచ్చారు. దీన్ని చూసిన ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని చర్చించుకున్నారు. గ్రామాల విద్యార్థులు చాలామంది బస్సు సౌకర్యం లేక రోడ్లపై పడిగాపులు కాశారు.

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాల, కేజీబీవీ, నాగార్జున స్కూల్, ధనియాన్‌చెరువు జెడ్పీ పాఠశాల, తూర్పుం నడింపల్లి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. మండలవ్యాప్తంగా 244మంది పరీక్ష రాశారని, 13మంది గైర్హాజరయ్యారని డిపార్టమెంట్ అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్‌బాబు తనిఖీ చేశారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పదిపరీక్షలు సజావుగా జరిగాయి. 316మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 13మంది గైర్హాజరైనట్లు చీఫ్ బాలాజీ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఈఓ మీనాక్షి పరిశీలించారు. ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రంలో 158మందికిగాను ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సతీష్ తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో పరీక్ష కొనసాగింది.

ముదిగుబ్బ: మండలవ్యాప్తంగా 3 కేంద్రాలలో పదో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తంగా 727 మంది విద్యార్థులకుగాను 699 మంది హాజరయ్యారని డిపార్ట్‌మెంట్ చీఫ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ యతీంద్ర బందోబస్తు నిర్వహించారు.

బుక్కపట్నం: మండలకేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నతపాఠశాల పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పది పరీక్షలు సజావుగా జరిగాయి. బాలికల పాఠశాలలో 158మందికిగాను 152మంది, బాలుర పాఠశాలలో 188కిగాను 186మంది పరీక్షలు రాశారు. మొత్తం 346మందికిగాను 8మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రహిమాన్ తెలిపారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, విజ్ఞాన, శ్రీవిజ్ఞాన్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ భాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ప్రతి గదికి వెళ్లి విద్యార్థుల పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు.



కదిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు



నల్లమాడలోని ఆశ్రమ పాఠశాల కేంద్రం వద్ద ..



ధర్మవరంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

పరిపూర్ణానంద స్వామి

హిందూపురం అర్బన్, మార్చి 18: హిందూపురం పార్లమెంట్ సమగ్ర అభివృద్ధి కాంక్షిస్తూ నిర్వహించే బైక్ ర్యాలీకి భారీగా హిందువులు తరలిరావాలని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పిలుపునిచ్చారు. ఈ మేకరు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణ పరిధిలోని పవిత్ర సూగూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. అంబేడ్కర్ సర్కిల్ వరకు ఉంటుందన్నారు. పార్లమెంట్ పరిధిలోని హిందూపురం, పెనుకొండ, కదిరి, రాప్తాడు, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాల అభివృద్ధి ఆకాంక్షిస్తూ చేస్తున్న ఈ ర్యాలీకి పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆసక్తి గల వారు తెల్లచొక్కా కాషాయం కండువా ధరించి రావాలని కో రారు. ర్యాలీ అనంతరం ప్రసాద వినియోగం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ, వాటర్‌ఫిల్టర్ వితరణ

పెనుకొండ, మార్చి 18 : పట్టణంలోని అల్విన్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ స్థానిక బ్రాంచ్ ఆధ్వర్యంలో టీవీ, వాటర్‌ఫిల్టర్, ఓవర్‌హెడ్ ట్యాంక్, భవనానికి పెయింట్లను సమకూర్చారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు స్థానిక బ్రాంచ్ మేనేజర్ వెంకటరమణయ్య సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద హాజరై వాటిని సీడీపీఓ శాంతలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి కింద వీటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్పలత, సుజాత, అంగనవాడీ వర్కర్ రాజేశ్వరి, హెల్పర్ మాబున్నీసా, స్థానికులు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ల్యాబ్ పరికరాలు..

హిందూపురం అర్బన్, మార్చి 18: దేశం గర్వించదగ్గ ఇంజనీర్లుగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదగాలని బర్జర్ పెయింట్స్ జీఎం వెంకట అప్పారావు, ఫైనాన్స్ హెడ్ వినయ్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ దేవరాజులు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు తూమకుంట పారిశ్రామిక వాడలోని బర్జర్ పెయింట్స్ వారు రూ.8.5 లక్షల విలువ గల ల్యాబ్ పరికాలను సోమవారం అందించారు. కళాశాలలో ఈసీఈ విభాగా నికి చెందిన రూ. 5.23 లక్షల మైక్రోవేవ్ బెంచ్‌లు అందించారు. అదే విధంగా సివిల్ ఇంజనీ రింగ్ విభాగానికి చెందిన రూ.3.40 లక్షల హైడ్రాలిక్ పరికరాలను ప్రయోగశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, ఈసీఈ హెచ్‌ఓడీ శ్రీనివాసులు, సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌ఓడీ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

రొళ్ల, మార్చి 18: పౌష్టికాహారం ప్రాముఖ్యతపై మండలం అగ్రహారం గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఆర్టీటీ ఏటీఎల్ ఓబుళేశు, సూపర్‌వైజర్ సన్నక్క, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిరుధాన్యాల ప్రాముఖ్యత వివరించారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు మొలకెత్తిన విత్తనాలు, అంగన్‌వాడీలో అందించే పాలు, గుడ్లు, తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

బ్రహోత్సవాల కమిటీ నియామకం

కదిరి, మార్చి 18: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహోత్సవాలకు కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. 11మందితో సోమవారం కమిటీ నియమించారు. వీరు 2024, మార్చి 19 నుంచి 2024, ఏప్రిల్ వరకు కమిటీ సభ్యులుగా ఉంటారు. విశ్వనాథ్‌రెడ్డి, నామా వెంకటరామప్రసాద్, లింగాల లోకేశ్వర్‌రెడ్డి, బి. ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణనాయక్, గంగాధర్, శాంతమ్మ, భాగ్యలక్ష్మి, త్రివేణి, చండీప్రియ, శ్రీదేవిని నయమించినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

20న కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పణ

ఈనెల 20వ తేదీన జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2014 నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోందన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పించే జీవో తీసుకొచ్చినట్లు చెప్పారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

మడకశిర రూరల్, మార్చి 18: మండలంలోని బీ రాయపురం, సీ కోడిగేపల్లిల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీ రాయపురం గ్రామస్థులు మాట్లాడుతూ... గ్రామంలో మూడు బోర్లు ఉన్నాయని తెలిపారు. వాటిలోని రెండు బోర్లలో నీటి మట్టం తగ్గిపోయి నీరు రావడం లేదన్నారు. దీంతో గ్రామ సమీపంలో ఎనిమిది నెలలు కిందట పంచాయతీ వారు మరో బోరు వేశారని తెలిపారు. అయితే అక్కడి నుంచి గ్రామంలోకి ఇప్పటి వరకు పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని వాపోయారు. అదే విధంగా సీ కోడిగేపల్లిలో నాలుగు బోర్లు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. అన్ని బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో గ్రామం చివరిలో ఉన్న ఇళ్లకు నీరు అందడం లేదన్నారు. దీంతో తాగునీటి కోసం సమీప వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హద్దుదాటితే కేసే..!

సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు



తూమకుంట చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

హిందూపురం, మార్చి18: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్ర సరిహద్దులో నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్ణాటక నుంచి మద్యం, ఎక్కువ మొత్తంలో నగదు, బిల్లులు లేకుండా ఇతరత్రా వస్తువులు తీసుకొస్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామంటున్నారు. సోమవారం బీఎస్ఎఫ్ దళంతో కలిసి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.



పురం ఎంజీఎం పాఠశాల వద్ద వేచివున్న విద్యార్థులు



పెనుకొండ బాలుర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడి



గోరంట్లలో శ్రీ చైతన్య పాఠశాలలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అక్బల్ బాషా

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతం పేపర్ -1 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి పంపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు సంబంధించి సంబంధిత అధికారులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

హిందూపురం అర్బన్, మార్చి 18: పట్టణంలోని కేంద్రాల్లో సోమవారం మొదటిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. అయితే ఎంజీఎం పాఠశాల బీ బ్లాక్‌లోని ఓ గదిలో ఫ్యాను తిరగలేదు. ఈ విషయాన్ని విద్యార్థులు ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా హిందూపురం లోని 15 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 3217 మంది ప రీక్షలు రాయాల్సి ఉండగా 3063 మంది హాజరయ్యారు. 154 మంది గైరారయ్యారు.

పెనుకొండ : పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు పేపర్ -1 పరీక్షకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 196మందికిగాను నలుగురు గైర్హాజరయ్యారు. అలాగే బాలికల ఉన్నత పాఠశాల ఏ- కేంద్రంలో 215 మందికిగాను ఏడుగురు, బీ - కేంద్రంలో 176 కుగాను 11మంది గైర్హాజరయ్యారు.

గోరంట్ల: పదో తరగతి విద్యార్థులకు గోరంట్లలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 46మంది గైర్హాజరైనట్లు ఎంఈఓలు గోపాల్, జాన్‌రెడ్డెప్ప తెలిపారు. మొత్తం 1,116మందికిగాను 1,070 మంది పరీక్షలు రాశారు. శ్రీవివేకానంద పాఠశాలలో 230మందికిగాను 223మంది, శ్రీచైతన్య ఏ - కేంద్రంలో 197 మం దికిగాను 188మంది, బీ - కేంద్రంలో 127మందికిగాను 122మంది హాజరయ్యారు. న్యూ మాంటిస్సోరిలో 249మందికిగాను 233మంది, ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 195కుగాను 186మంది హాజరయ్యారు. బాలికల ఉన్నతపాఠ శాలలో 118మందికిగాను అందరూ పరీక్షలు రాశారు. శ్రీచైతన్య పాఠ శాల, న్యూ మాంటిస్సోరిలో పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ అక్బల్ బాషా తనిఖీ చేశారు.



ఎంజీఎం పాఠశాల బీ బ్లాక్‌లో తిరగని ఫ్యాను ఇదే...

రొద్దం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఏ, బీ - కేంద్రాలు, కేజీబీవీలో సీ - కేంద్రంలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఏ - కేంద్రం 230మందికిగాను 222మంది, బీ - కేంద్రంలో 221కి 211 హాజరయ్యారు. సీ- కేంద్రంలో 138కిగాను 128మంది హాజరయ్యారు. మొత్తం 28 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖాధి కారులు తెలిపారు.

చిలమత్తూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 504 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 486 మంది హాజరయ్యారు. స్థానిక ఎస్ఎస్‌వైవిఎన్ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏ - కేంద్రంలో 268 మందికిగాను 255 మంది హాజరయ్యారు. బీ - కేంద్రంలో 236 మందికి గాను 231 మంది హాజరయ్యారు. మొత్తంగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాల జూనియర్‌కళాశాల, మహాత్మజ్యోతిరావు పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాల ను నిర్వహించారు. మండల వ్యాప్తంగా 797మంది విద్యార్థులు పరీక్షలురాయాల్సి ఉండగా 737మంది హాజరయ్యారు. 60మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగరాజు నాయక్ తెలిపారు.

మడకశిరటౌన్: పట్టణం, మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1316 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1240 మంది హాజరయ్యారు. 76 మంది గైర్హాజరయ్యారు. మొట్టమొదటి సారిగా ఆమిదాల గొంది ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సెయింట్ ఆన్స్‌లో రెండు కేంద్రాలు, సిద్ధార్థ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ప్రభు త్వ జూనియర్, ఒకేషనల్, ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గుడిబండ: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 640 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా 621మంది హాజరైనట్లు ఎంఈఓలు గంగప్ప, రవిచంద్ర కుమార్ తెలిపారు. పాఠశాలలోని ఏ - కేంద్రంలో 250మందికి గాను ఆరుగురు, బీ - కేంద్రంలో 250మందికిగాను ఎనిమిది మంది, సీ- కేంద్రంలో 140మందికి గాను ఐదుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



రొద్దం జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు వేచి ఉన్న విద్యార్థులు



చిలమత్తూరులో పరీక్షా కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు



మడకశిరలో పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



పెనుకొండలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 18 : పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గత ఎనిమిదేళ్ల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరామని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సవిత సమక్షంలో వంద మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెనుకొండ మండలంలోని మావటూరు నుంచి 60కుటుంబాలు, రొద్దం మండలం చెరుకూరు నుంచి 16, పరిగి మండలం వంగంపల్లి, ఎస్సీ కాలనీ నుంచి పలు కుటుంబాలు పార్టీలోకి చేరాయి. వారికి సవిత పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాను అందరికీ అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పూర్తి అభివృద్ధి చేస్తామని తెలిపారు. చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు మాధవనాయుడు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవితను కలిసిన కాంగ్రెస్ నాయకుడు : మండలంలోని కసిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితను పెనుకొండలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె టీడీపీలో చేరాలని కోరగా అందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. పార్టీ మార్పు లోచ నపై రాజారెడ్డిని వివరణ కోరగా.. చంద్రబాబు నాయకత్వంపై ఉన్న నమ్మకం, టీడీపీ ద్వారా ప్రజలకు సేవ చేయవచ్చన్న ఉద్దేశ్యంతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

రొళ్ల: మండలంలోని హెచ్‌టీ హళ్లిలో సోమవారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ బాబు మారిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు వైసీపీ యువనాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప, దర్శన్, మారన్న, రంగధామప్ప, జయరంగప్ప తదితర నాయకులకు చెందిన దాదాపు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి మాజీ ఎమ్మెల్యే ఈరన్న పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తా యన్నారు. చంద్రబాబు ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, నాయకులు చిక్కణ్ణ, సన్నమారేగౌడ్, శివన్న, బండిరమేష్ తదితరులు పాల్గొన్నారు.



రొళ్లలో ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న, అభ్యర్థి సునీల్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్, మార్చి 18 : మండల పరిధిలోని అమ్మవారిపల్లి సమీపంలో కొటక్ కంపెనీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమామహేశ్వరి(34) మృతిచెందగా, కుటుంబ సభ్యులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కడప జిల్లా జమ్ములమడుగు పట్టణానికి చెం దిన మురళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన, భార్య ఉమామహేశ్వరి కొన్నేళ్ల కిందట బెంగళూరులోనే ఉద్యోగం చేసుకుంటూ స్థిరప డ్డారు. వారికి ఇద్దరు పిల్లలు. వారు మూడు రోజుల కిందట కారులో హైద రాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరి అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త మురళి, కుమారుడు చైతన్య, కుమార్తె శ్రీనిధి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఉమామహేశ్వరి మృతదేహం, దెబ్బతిన్న కారు

24 నుంచి కైవారం తాతయ్య జయంత్యుత్సవాలు

హిందూపురం అర్బన్, మార్చి 18: కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా కైవారం శ్రీక్షేత్రం యోగినారాయణ జయంతి ఉత్సవాలను ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు యోగి నారాయణ సేవాసమితి హిందూపురం అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. స్థానిక కెవీ ఆర్ ఫంక్షన్ హాల్‌లో జయంతికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు జగదీష్, మహేష్, నాగరాజు, చంద్ర, రాజ్యలక్ష్మీ మోహన్, నారాయణప్ప, బాబన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో వివక్ష

వైసీపీ హోర్డింగుల తొలగింపులో అధికారుల మీనమేషాలు



నింకంపల్లి, సీపీఐ కాలనీ, నింకంపల్లికి వెళ్లే దారిలో అలాగే వున్న హోర్డింగ్‌లు

హిందూపురం, మార్చి18: ఎన్నికల షెడ్యూలు విడుదలైనా అధికారులకు మాత్రం వైసీపీపై ఇంకా ప్రేమ తగ్గడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న పలువురు అంటున్నారు. షెడ్యూలు విడుదలై 48 గంటలు దాటినా ప్రభుత్వ, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల హోర్డింగులు తొలగించాలనే ఆలోచన వారికి రాకపోవడం దురదృష్టకరం అంటున్నారు. హిందూపురం పట్టణంలో వైసీపీ మినహా మిగిలిన పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు తొలగించారు. అయితే వైసీపీకి చెందిన హోడ్డింగులను అక్కడక్కడ వదిలేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపుపై వివక్ష పాటిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల షెడ్యూలు విడుదలై న 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ఫొటోలు, ఫెక్సీలు వుండ కూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కాగా టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించి వైసీపీకి చెందిన పోస్టర్లు, హోర్డింగులను అధికారులు వదిలేయడం పట్టణంలోఇ చర్చనీయాంశంగా మారింది. పట్టణంలో కొన్నిచోట్ల సోమవారం సాయంత్రం 5 గంటలకు కూడా అలాగే వున్నాయి. దీనిని బట్టి వైసీపీపై అధికారులకు ఎంత మోజు వుందో అర్థమవుతోందంటున్నారు. వాటిని వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా... కొంతమంది సచివాలయ సిబ్బంది మాత్రం జగన్ ఫోటోతో ఉన్న ఫెక్సీలు తొలగించడానికి జంకుతున్నట్లు సమాచారం. ఇది ఆయనపై ఉన్న అభిమానమా లేక భయమా తెలియడం లేదని ప్రజలంటున్నారు. ఏది ఏమైనా షెడ్యూలు విడుదలై 48 గంటలు దాటినా తొలగించక పోవడం ఎన్నికల నియమావళిని ఉల్లంగించడమే అంటున్నారు. మరి సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అంటున్నారు.

ప్రజాగళం విజయవంతం... కూటమిదే విజయం: బీకే

పెనుకొండ, మార్చి 18 : వైసీపీ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజాగళం సభ ఘనంగా విజయవంతం కావడమే అందుకు నిదర్శనమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. వైసీపీ, జాతీయ కాంగ్రెస్‌పార్టీలు వేర్వేరు కాదని, అవి రెండూ ఒకే కుటుంబానికి చెందినవే అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, ఆ పార్టీ మంత్రులు అవినీతిలో పోటీపడుతున్నారన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సహకారంతో పోలవరం ప్రాజెక్టను 72శాతం పూర్తి చేసిందన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టను అడ్డుకోవడమేకాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టలను అధ్వానంగా మార్చిందన్నారు. ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి జగన్ పాలన మారుపేరుగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కలెక్టర్ కార్యాలయ భవనాలను, రైతుబజార్, కళాశాల భవనాలను జగన్ ప్రభుత్వం తనఖా పెట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించడం తథ్యమన్నారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

పేదల ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వాలని వినతి



తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, మార్చి 18 : కోర్టు ఉత్తర్వుల మేరకు స్వాధీన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలంటూ పట్టణంలోని ఇళ్లులేని నిరుపేదలు డిమాండ్ చేశారు. వారు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పెద్దన్న, రమేష్ మాట్లా డుతూ... పట్టణంలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందన్నారు. కానీ అధికారులు కోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా ఇళ్ల నిర్మాణ పనులను అడ్డు కుంటున్నారన్నారు. ఈవిషయమై తాము మళ్లీ హైకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని, వెంటనే అనుమతులు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో సర్వే నంబరు 733, 83లో ఉన్న వందలాది ఎకరాల బీడుభూమిని అనుభవిస్తున్న వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్దన్న, కేవీపీఎస్ అధ్యక్షుడు హనుమయ్య, నాయకులు గంగాధర్, వెంకటరమణ, నాగభూషణం, కొండా వెంకటేశులు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలను తొలగించిన స్థలంలో వంటావార్పు



వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న పేదలు

పెనుకొండ టౌన్, మార్చి 18 : అధికార పార్టీ వైసీపీకి నిరుపేదలంటే చిన్న చూపని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బాలస్వామి తదితరులు మండిపడ్డారు. సోమందేపల్లి మండలంలోని నల్లగొండ్రాయనపల్లి సమీపంలో తొలగించిన గుడిసెల వద్ద సోమవారం పేదలు వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమందేపల్లి సర్వే నంబరు 700లో ఇళ్లులేని నిరు పేదలం గుడిసెలు వేసుకున్నామన్నారు. అయితే అధికారులు వాటిని తొలగిం చారని తెలిపారు. ఇప్పటికైనా తమను గుర్తించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేసేవరకు చెట్లకిందే జీవనం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పేదలు చాంద్‌బాష, వలి, అంజనమ్మ, కవిత, ఆంజనేయులు, తిమ్మయ్య, గుర్రమ్మ, అంకన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కింద పడి వ్యక్తి మృతి

ముదిగుబ్బ, మార్చి18: మండలంలోని రాళ్లఅనంతపురం క్రాస్ సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై సోమవారం పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన జిలాన్(50) ముదిగుబ్బ మండలంలోని రాళ్ళఅనంతపురం క్రాస్ దగ్గర ఒక గోడౌన్‌కు వెల్డింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.